స్పోర్ట్స్ గదిని ప్రారంభించిన కార్పొరేటర్


స్పోర్ట్స్ రూమ్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ కంది శైలజ

బౌద్ధనగర్: పిల్లలు చదువుతోపాటు ఆటల్లో కూడా రాణించాలని కార్పొరేటర్ కంది శైలజ అన్నారు. బౌద్ధనగర్ డివిజన్‌లోని జవహర్ లాల్ నెహ్రూ ఇంగ్లిష్ మీడియం స్కూలులో ఏర్పాటు చేసిన స్పోర్ట్స్ రూమ్‌ను ఆమె సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు అన్ని విద్యల్లోనూ రాణించాల్సిన అవసరం ఉందన్నారు. చదువుతోపాటు ఆటపాటల్లో కూడా తమదైన శైలిలో దూసుకుపోవాలని సూచించారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ నాయుడు, టీచర్లు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయాలి


అభివృద్ధి పనులపై ఆరా తీస్తున్న కార్పొరేటర్ సామల హేమ

చిలకలగూడ: సీతాఫల్‌మండి డివిజన్ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని స్థానిక కార్పొరేటర్ సామల హేమ కోరారు. జోషి కాంపౌండ్, అజాద్ చంద్రశేఖర్ నగర్ ప్రాంతాల్లో సీసీ రోడ్డు, వరదనీటి పైప్‌లైన్ పనులను జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి సోమవారం పరిశీలించారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా, ట్రాఫిక్‌కు అంత రాయం కలగకుండా, నాణ్యతాప్రమాణాలు పాటిస్తూ నిర్మాణ పనులు పూర్తి చేయాలని అధికారులు, కాంట్రాక్టర్లకు సూచించారు. స్థానికుల అభ్యర్థన మేరకు జోషికాంపౌండ్‌లో ప్రమాదకరంగా మారిన విద్యుత్ స్తంభాన్ని తక్షణమే తొలగించి నూతనంగా ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులను కోరారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ కౌశిక్, బీఆర్ఎస్ సమన్వయకర్త రాజుసుందరం తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం: కలెక్టర్

రసూల్‌పురా: జీవితంలో క్రీడలకు ఎంతో ప్రాముఖ్యత ఉందని, స్నేహభావం పెంపొందించడంతోపాటు శారీరక దృఢత్వానికి, మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 8 నుంచి 16 వరకు ప్రభుత్వ ప్రీ మెట్రిక్, పోస్టుమెట్రిక్ గృహాల విద్యార్థులకు జిల్లాస్థాయిలో జరిగిన కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, రన్నింగ్ పోటీల్లో విజేతలకు సోమవారం జింఖానా మైదానంలో కలెక్టర్ బహుమతులు ప్రదానం చేశారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, ఓడినవారు మళ్లీ గెలిచేందుకు ప్రయత్నించాలని సూచించారు. విద్యార్థులు రాష్ట్రస్థాయిలో జరిగే క్రీడల్లో రాణించి హైదరాబాద్ జిల్లాకు చాంపియన్‌షిప్ సాధించాలని ఆకాంక్షించారు. వసతిగృహ అధికారులు, పీఈటీలకు మెమొంటోలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ ఉపసంచాలకులు జి.ఆశన్న, యువజన క్రీడా అధికారి సుధాకర్, డీపీఆర్ఓ అబ్దుల్ కలీం, అధికారులు టి.నరసింహులు, కె.సంజీవులు, డి.కృష్ణమాచారి, వసతిగృహ అధికారులు జ్యోతి, రజని, కిరణ్, సుశాంత్ తదితరులు పాల్గొన్నారు.

గమ్యస్థానానికి చేరుస్తామంటూ దోపిడీ

సనత్‌నగర్: ఆటోలో గమ్యస్థానానికి చేరుస్తామని నమ్మబలికి అర్ధరాత్రి ప్రయాణికుడిని బెదిరించి దోపిడీకి పాల్పడిన ముగ్గురు సభ్యులు కలిగిన ముఠాను సనత్‌నగర్ పోలీసులు అరెస్టు చేశారు. సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులుతో కలిసి బాలానగర్ ఏసీపీ హనుమంతరావు వివరాలను వెల్లడించారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన అభిషేక్ కుమార్ జీవనోపాధి నిమిత్తం వలస వచ్చి నగర శివారు ప్రాంతమైన ఆర్‌సీపురంలో నివాసముంటూ బాలానగర్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. ఇటీవల అభిషేక్ కర్నూలు వెళ్లి తిరిగి వచ్చే క్రమంలో ఈ నెల 16న అర్ధరాత్రి ఎంజీబీఎస్‌లో బస్సు దిగాడు. తాను ఉండే ఆర్‌సీపురం వెళ్లేందుకు ట్యాక్సీ కోసం అక్కడ వేచి చూస్తుండగా ఆటోలో ఉన్న ముగ్గురు అతని వద్దకు వచ్చి ఆర్‌సీపురం తీసుకువెళ్తామని బేరం కుదుర్చుకున్నారు. అభిషేక్‌కుమార్‌ను ఆటోలో ఎక్కించుకుని ఆర్‌సీపురం బయలుదేరి ఎర్రగడ్డ దాటిన తర్వాత భరత్‌నగర్ నుంచి యూటర్న్ తీసుకుని సనత్‌నగర్ రైల్వేస్టేషన్ సమీపంలోని నిర్మానుష్య ప్రదేశంలోకి తీసుకువెళ్లారు.

కత్తి చూపి బెదిరించి...

కత్తి చూపి అభిషేక్‌ను బెదిరించి, అతడి దగ్గర ఉన్న రూ.4 వేల నగదు, మొబైల్ ఫోన్ లాక్కున్నారు. అనంతరం మొబైల్ ఫోన్ పాస్‌వర్డ్ చెప్పమంటూ బెదిరించి ఫోన్ పే ద్వారా ఒకసారి రూ.1181, మరోసారి రూ.12,700 ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నారు. మరింత డబ్బు కావాలని భయపెట్టడంతో బాధితుడు తన మిత్రుడైన రోహిత్‌పాల్‌కు ఫోన్ చేసి మరో రూ.200 నిందితుల ఖాతాకు బదిలీ చేయించాడు. అంతటితో ఆగకుండా బాధితుడిని చితకబాది పరారయ్యారు. బాధితుడు సనత్‌నగర్ పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందంగా ఏర్పడి నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఆటోడ్రైవర్ అయిన ఠాకూర్ సురేందర్ సింగ్ (22), బిరాదర్ సంతోష్ (22), షేక్ హుజైర్ బాబా(23)లను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి పోలీసులు ఆటోతోపాటు మూడు మొబైల్ ఫోన్లు, కత్తి స్వాధీనం చేసుకున్నారు.

తైక్వాండోతో విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం



తైక్వాండో బెల్టుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

లాలాపేట: ది షీల్డ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో సోమవారం శాంతినగర్‌లోని తక్షశిల పబ్లిక్ స్కూల్లో తైక్వాండో కలర్ బెల్టు పరీక్ష విజయవంతంగా నిర్వహించారు. ప్రముఖ తైక్వాండో కోచ్ ముత్యం దిలీప్ మార్గదర్శకత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో 50 మంది విద్యార్థులు పాల్గొని ఫార్మ్స్(పూమ్సే), స్వీయరక్షణ, స్పారింగ్ తదితర అంశాల్లో తమ నైపుణ్యాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కొత్త కలర్ బెల్టులను అందజేశారు. అనంతరం ప్రిన్సిపాల్ తనుప్రీత్ కౌర్ మాట్లాడుతూ తైక్వాండో వల్ల విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, ఏకగ్రాత, స్వీయరక్షణ అలవడుతాయన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ మహిపాల్‌రెడ్డి, చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ సంతోష్‌కుమార్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మార్మోగుతున్న శరణు ఘోష


సనత్‌నగర్ అయ్యప్ప దేవాలయం...

- సనత్‌నగర్ అయ్యప్ప దేవాలయంలో స్వాముల కోలాహలం
- ప్రతియేటా నిత్యాన్నదానం... వందలాది మంది భక్తుల హాజరు..

సనత్‌నగర్: కార్తీక మాసం ప్రారంభమైందంటే... అక్కడ శరణం శరణం అయ్యప్ప శరణమంటూ కంఠధ్వనులు మారుమోగుతాయి. ప్రతియేటా గ్రేటర్ హైదరాబాద్ నుంచి ఏటా ఐదు లక్షల మందికిపైగా అయ్యప్పలు శబరిగిరికి వెళ్తుండగా, అందులో రూ.50 వేల పైచిలుకు స్వాములు సనత్‌నగర్ కేంద్రంగా మాలాధారణ చేస్తుండటం గమనార్హం. 1962వ సంవత్సరంలో అప్పటి ఆల్విన్ కార్మికుడు బిక్షపతిగౌడ్ తన ఏడుగురు మగపిల్లల తరువాత ఆడపిల్ల పుట్టడంతో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ జరిపించి మొక్కును తీర్చుకున్నారు. తదనంతరం ఎనిమిది ఎకరాల స్థలాన్ని హనుమాన్ దేవస్థానానికి విరాళంగా ఇచ్చారు. ఈ క్రమంలో 1983 తరువాత చేపట్టిన సకల దేవతామూర్తుల దేవాలయాల నిర్మాణ పరంపరంలో భాగంగా ఇక్కడ అయ్యప్పస్వామి దేవాలయం కూడా వెలిసింది. నిర్మాణం వెనుక దామోదర్‌రెడ్డి, కంజర్ల శంకర్ యాదవ్, పీవీ సుబ్బారావు, అరుణ్‌గురుస్వామి, పార్థసారథి, సాయి, అమర్‌నాథ్‌గుప్తా, సురేశ్, ఎల్.నర్సింగరావు, యెంజాల నర్సింగరావు తదితరులు కీలక పాత్ర పోషించారు. నగరంలో మొదట బొల్లారంలో మాత్రమే అయ్యప్ప దేవాలయం ఉండేది. సనత్‌నగర్ అయ్యప్ప దేవాలయం నగరంలో రెండోదిగా ఖ్యాతికెక్కింది. సనత్‌నగర్, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, బాలానగర్, మియాపూర్ వంటి ప్రాంతాల నుంచి భక్తులు ఇక్కడి స్వామి సన్నిధికి వచ్చి మాలాధారణ చేయడం ఆనవాయితీగా వస్తోంది.


మాలధారణ చేసిన స్వాములు

17నుంచి నిత్యాన్నదానం...

దాతల సహకారంతో ప్రతియేటా నిత్యాన్నదాన కార్య క్రమాన్ని దిగ్విజయంగా నిర్వహిస్తూ వస్తున్నారు. ఎంతమంది స్వాములకైనా నిర్విఘ్నంగా ఇక్కడ అన్నసంతర్పణ కొనసాగుతుంటోంది. ఈ నెల 17 నుంచి జనవరి 14 వరకు నిత్యాన్నదాన కార్యక్రమం ఉంటుంది.

అయ్యప్ప దీక్షతో ఆరోగ్యకర వాతావరణం



అయ్యప్ప దీక్షలో ఆరోగ్యసూత్రం నిగూఢమై ఉందని శాస్త్రీయబద్ధంగానే రుజువైంది. వేళలను పాటిస్తూ భిక్ష, చద్ది చేయడం ద్వారా ఒంట్లోని బీపీ, షుగర్ వంటి వ్యాధులు అదుపులోకి వస్తాయని వైద్యులు చెబుతున్నారు. దీక్షాకాలంలో వ్యసనాలకు దూరంగా ఉండటం ద్వారా దీక్ష విరమణ అనంతరం కూడా అదేవిధంగా జీవించేలా చేస్తుంది. –అరుణ్‌గురుస్వామి, అఖిల భారత అయ్యప్ప సేవా సంఘం ప్రధాన కార్యదర్శి

స్వాముల నియమాలకు అనుగుణంగా సేవలు

అయ్యప్ప మాలాధారణ చేసేవారి కోసం వారి నియమాలకు అనుగుణంగా సేవలు అందిస్తున్నాం. ప్రతియేటా అరుణ్‌గురుస్వామి చేతులమీదుగా రోజుకు 300–500 మంది వరకు మాలాధారణ చేస్తున్నారు. జంటనగరాల నుంచి ఇక్కడికి వచ్చే స్వాములకు భిక్ష అందేలా చర్యలు తీసుకుంటున్నాం. శుచి, శుభ్రత కోసం ప్రత్యేక సిబ్బందిని కూడా నియమిస్తున్నాం.
– సత్యనారాయణ, ఆలయ ఈవో

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.27, నల్ల వంకాయ 45, పొడుగు వంకాయ 35, బెండకాయ 40, పచ్చిమిర్చి 35, బజ్జీమిర్చి 60, క్యాప్సికమ్ 65, పచ్చకాకర 23, పందిరి బీర 38, క్యాబేజీ 31, క్యారెట్ 65, దొండ 23, గుండుబీన్స్ 53, గింజ చిక్కుడు 60, గోకరకాయ 28, కీర 18, దోసకాయ 33, బీట్‌రూట్ 55, ఉల్లిగడ్డ 40, ఆలుగడ్డ 37, చామగడ్డ 35, మొరంగడ్డ 28, కందగడ్డ 45, సొరకాయ 15, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 4–5, ముల్లంగి 5–6. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

ఓయూ సభకు రాహుల్‌ను ఆహ్వానిస్తాం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట డిసెంబర్ 8న జరిగే కృతజ్ఞత మహాసభకు కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీని ఆహ్వానించనున్నట్లు నిరుద్యోగ జేఏసీ చైర్మన్ కోటూరి మానవతారాయ్ తెలిపారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తున్నందున నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో కృతజ్ఞత మహాసభ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రాహుల్‌గాంధీతోపాటు సీఎం రేవంత్‌రెడ్డి, ఇతర మంత్రులు, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్, పలువురు ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎన్ఎస్‌యూఐ, ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ జాతీయ అధ్యక్షులను సైతం ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 21న మహాసభ కరపత్రాన్ని ఆవిష్కరించనున్నట్లు చెప్పారు.

సెయింట్ మేరీస్ కాలేజ్‌లో ఎండీపీ ప్రారంభం

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ సెయింట్ మేరీస్ కాలేజ్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో సాఫ్ట్ స్కిల్స్ ఫర్ పర్సనల్, ప్రొఫెషనల్ ఎక్సలెన్స్‌పై వారంపాటు నిర్వహించే మేనేజ్‌మెంట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్(ఎండీపీ) సోమవారం ప్రారంభమైంది. మైక్రో, స్మాల్, మీడియం ఎంటర్‌ప్రైజెస్ ద్వారా ఎంఎస్ఎం ఈ మంత్రిత్వ శాఖకు చెందిన డెవలప్‌మెంట్ కమిషనర్ విద్యార్థుల కేరీర్‌లో సాఫ్ట్ స్కిల్స్ పెంపొందించేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు కళాశాల డైరెక్టర్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఆంథోనీ వినయ్ అన్నారు. విద్యార్థుల టీమ్ వర్క్, చురుగ్గా వినడం, సమస్యల పరిష్కారం, విమర్శనాత్మక ఆలోచన, కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించేందుకు ఎంతగానో దోహదపడతాయని చెప్పారు. కార్యక్రమంలో ఫిలిప్‌పెన్స్‌కు చెందిన అమిందా బృందం, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు

నేడు కాలేజీల బంద్.. పరీక్షల బహిష్కరణ

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలోని వివిధ వర్సిటీల పరిధిలోని కాలేజీలను నిరవధిక బంద్ చేసి, పరీక్షలను బహిష్కరిస్తున్నట్లు ప్రైవేటు డిగ్రీ, పీజీ కాలేజీల యజమానుల సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు సూర్యనారాయణరెడ్డి, రామకృష్ణ తెలిపారు. సోమవారం వారు ఓయూలో మాట్లాడుతూ పరిధిలో మంగళవారం నుంచి జరిగే అన్ని పరీక్షలను బహిష్కరిస్తున్నట్లు రిజిస్ట్రార్ నరేష్‌రెడ్డికి నోటీసులు అందచేసినట్లుచెప్పారు. గత నెలలో నాలుగు రోజులు కాలేజీలను బంద్ చేయగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.7 వేల కోట్లు విడుదల చేస్తామని సీఎం, ఇతర మంత్రులు హామీ ఇచ్చారని తెలిపారు. కానీ, ఇంతవరకు ఒక్క రూపాయి కూడా విడుదల చేయనందున కాలేజీలను మూసేసి పరీక్షలను బహిష్కరిస్తున్నట్లు చెప్పారు.

ఓయూ పరీక్షలు యథాతథం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలో జరుగుతున్న బీఎస్సీ సెమిస్టర్ పరీక్షలు యథాతథంగా కొనసాగుతాయని ఎగ్జామినేషన్ కంట్రోలర్ ప్రొ.శశికాంత్ సోమవారం తెలిపారు. కాలేజీ యజమానులు బంద్ పాటించిన బీఎస్సీ 3, 5, 7 సెమిస్టర్ల పరీక్షలు కొనసాగుతాయన్నారు. పరీక్షలు వాయిదా పడ్డాయనే వదంతులు నమ్మవద్దని ఎగ్జామినేషన్ కంట్రోలర్ పేర్కొన్నారు.

21 నుంచి 24 వరకు 'లోకమంథన్'


లోకమంథన్ భాగ్యనగర్ సాంస్కృతిక ఉత్సవాల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న తపస్ జిల్లా అధ్యక్షులు తిరుపతిరెడ్డి, ఉపాధ్యాయులు

లాలాపేట: ప్రజ్ఞాభారతి ఆధ్వర్యంలో ఈ నెల 21 నుంచి 24 వరకు హైటెక్ సిటీ సమీపంలోని శిల్పారామంలో నిర్వహించ తలపెట్టిన లోకమంథన్ భాగ్యనగర్–2024 సాంస్కృతిక ఉత్సవాలను అందరూ వీక్షించాలనీ తెలంగాణ ఉపాధ్యాయ సంఘం హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు బి.తిరుపతిరెడ్డి అన్నారు. ఈ మేరకు దీనికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను సోమవారం లాలాపేటలోని ప్రభుత్వ బాలికల పాఠశాల(మార్కెట్ స్కూల్)లో తోటి ఉపాధ్యాయులతో కలిసి ఆవిష్కరించారు. తిరుపతిరెడ్డి మాట్లాడుతూ నాలుగు రోజులపాటు జరిగే ఈ కార్యక్రమానికి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ముఖ్యఅతిథిగా హాజరవుతారని తెలిపారు. ఇది భారతదేశ అతిపెద్ద సాంస్కృతిక కార్యక్రమమని పేర్కొన్నారు.

పాడైన పవర్ బోర్


మాణికేశ్వర్‌నగర్‌లో పాడైన పవర్ బోర్ ఇదే

లాలాపేట: తార్నాక మున్సిపల్ డివిజన్ మాణికేశ్వర్‌నగర్‌లో పవర్ బోర్ పాడైంది. వడ్డెర బస్తీలోని వీధి నెంబర్ 1లో ఉన్న పవర్ బోరు నెలరోజుల క్రితం పాడై పనిచేయడం లేదు. దీంతో స్థానికులకు నీటి సమస్య తలెత్తింది. ఈ విషయమై స్థానికులు పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని బస్తీ నాయకుడు గండికోట విజయ్‌కుమార్ అంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పవర్ బోరు మరమ్మతు చేయాలని బస్తీవాసులు కోరుతున్నారు.

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

సనత్‌నగర్: కుందన్‌బాగ్, బేగంపేట్ సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో కరెంటు సరఫరా ఉండదని గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ చరణ్‌సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మెథడిస్ట్ కాలనీ, రైల్వే ట్రాక్, సెయింట్ ఫ్రాన్సిస్ కాలేజ్, రాక్ గార్డెన్ పార్క్, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు గ్రీన్‌పార్క్ హోటల్, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్ ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందని పేర్కొన్నారు.

కార్తీక పూజా మహోత్సవాలు


స్వీట్స్ అలంకరణలో మల్లికార్జునుడు

సనత్‌నగర్: కార్తీక మాస పూజా మహోత్సవాలు కన్నులపండువగా జరుగుతున్నాయి. ప్రత్యేక అలంకరణలో మల్లికార్జునుడు దర్శనమిస్తూ భక్తులను కనువిందు చేస్తున్నారు. సనత్‌నగర్ హనుమాన్ దేవాలయ ప్రాంగణంలోని శివాలయంలో ఉత్సవాల్లో భాగంగా స్వామివారిని వివిధ రకాల స్వీట్స్‌తో అలంకరించిన తీరు ఆకట్టుకుంది. ఈఓ సత్యనారాయణ పర్యవేక్షణలో అర్చకులు రిపుంజయశర్మ ఆధ్వర్యంలో ప్రతిరోజూ అభిషేకాలు, అర్చనలు, సాయంత్రం హారతి, ఆకాశ దీపారాధన మహోత్సవాలు కొనసాగుతున్నాయి. కార్తీక సోమవారం పురస్కరించుకుని భక్తులు దీపాలను వెలిగించి భక్తిప్రపత్తులను చాటారు.

మహంకాళి దేవాలయంలో కార్తీక పూజలు

రాంగోపాల్‌పేట్: కార్తీక సోమవారం సందర్భంగా సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి దేవాలయ ప్రాంగణంలోని మహాకాళి సహిత వీరభద్రస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన పూజ నిర్వహించారు. ఈవో మనోహర్ రెడ్డి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు.


వీరభద్ర స్వామి వారు


దేవాలయంలో దీపాలు

మంత్రిని విమర్శిస్తే ఇల్లు ముట్టడిస్తాం

కంటోన్మెంట్ బోర్డు సభ్యుడిని హెచ్చరించిన కాంగ్రెస్ నేత శాంసన్ రాజు


పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న శాంసన్ రాజు

రసూల్‌పురా: మంత్రి పొన్నం ప్రభాకర్‌ను, ఎమ్మెల్యే శ్రీగణేశ్‌ను విమర్శిస్తే కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ ఇంటిని ముట్టడిస్తామని కాంగ్రెస్ పార్టీ కంటోన్మెంట్ మాజీ ప్రధాన కార్యదర్శి శాంసన్ రాజు హెచ్చరించారు. సోమవారం రసూల్‌పురాలో పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో కలసి శాంసన్ రాజు విలేకరులతో మాట్లాడారు. కంటోన్మెంట్ బోర్డు అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే శ్రీగణేష్ చొరవతో రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయిస్తే కేంద్రమంత్రుల సహకారంతో కేంద్రం నిధులు విడుదలయ్యాయంటూ రామకృష్ణ అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌కు అవగాహన లేదని రామకృష్ణ విమర్శించడం తగదని అన్నారు. ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి సీఎం రేవంత్‌రెడ్డి విశేషంగా కృషిచేశారని, ఈ విషయాన్ని రామకృష్ణ గుర్తుంచుకోవాలని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు ఆంజనేయులు, యాదగిరి, ఇటిక గోపి, జిలాని, గౌస్, అస్గర్, అన్నానగర్ మురళి, అజయ్‌కుమార్, మహేందర్, సురేష్, యాదగిరి, మహేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కార్తీక వనభోజనాలు


వన భోజనాలకు హాజరైన మహిళలు

అమీర్‌పేట: సనత్‌నగర్ డివిజన్ కేఎల్ఎన్‌వై మున్సిపల్ పార్క్‌లో కార్తీక మాస వనభోజనాలు జరిగాయి. ఇందులో భాగంగా సోమవారం మధ్యాహ్నం పార్కు ఆవరణలో ఉన్న ఉసిరి చెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఓం యోగా సాధన సమితి, వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వనభోజనాలకు యోగా, వాకర్స్ అసోసియేషన్ కుటుంబ సభ్యులతోపాటు స్థానిక మహిళలు హాజరయ్యారు.


ఉసిరిచెట్టుకు పూజలు చేసిన అసోసియేషన్ సభ్యులు

రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత

ట్రాఫిక్ అడిషనల్ కమిషనర్ విశ్వప్రసాద్


అవగాహన కార్యక్రమంలో నగర ట్రాఫిక్ అడిషనల్ కమిషనర్ విశ్వప్రసాద్..

సనత్‌నగర్: రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత అని నగర ట్రాఫిక్ అడిషనల్ కమిషనర్ విశ్వప్రసాద్ అన్నారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులకు బేగంపేటలోని ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ (టీటీఐ)లో 'రోడ్డు ప్రమాదాలు–నివారణ'అంశంపై సోమవారం అవగాహన కల్పించారు. ముఖ్యఅతిథిగా హాజరైన విశ్వప్రసాద్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలకు వాహనదారుల అవగాహనారాహిత్యమే కారణమన్నారు. ట్రాఫిక్ నియమాలపై అవగాహన లేకపోవడం వల్ల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని చెప్పారు. ఫుట్‌పాత్ లేనప్పుడు రోడ్డుపై వెళ్లేటప్పుడు కుడివైపున మాత్రమే నడవాలని, దీనివల్ల ఎదురు వచ్చే వాహనాలను గుర్తించి ప్రమాదాలను నివారించవచ్చని పేర్కొన్నారు. మద్యం సేవించి ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనం నడపవద్దన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ వర్క్‌తోనే కాకుండా అవగాహనా కార్యక్రమాల ద్వారా కూడా ట్రాఫిక్ ప్రమాదాలను నివారించడానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఆటోడ్రైవర్లకు ట్రాఫిక్ సిగ్నల్స్ గురించి వివరించారు. కార్యక్రమంలో నార్త్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు, బేగంపేట టీటీఐ ఇన్‌స్పెక్టర్ రాంచందర్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పాపయ్య, సిబ్బంది అయాన్, కృష్ణ, హీరో మోటోకార్ప్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజర్ సాదిక్ సాగర్, సూపర్‌వైజర్ శ్రవణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఓయూ దూరవిద్య మొదటి విడత ప్రవేశాలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ దూరవిద్య కోర్సుల్లో 2024–25 విద్యా సంవత్సరానికి మొదటి విడత ప్రవేశాల గడువు ముగిసిందని డైరెక్టర్ ప్రొ.జీబీ రెడ్డి సోమవారం తెలిపారు. డిగ్రీ, పీజీ, పీజీ డిప్లొమా కోర్సుల్లో 6,700 మంది ప్రవేశం పొందినట్లు తెలిపారు. రెండో విడత ప్రవేశాలు జనవరిలో ప్రారంభంకానున్నట్లు చెప్పారు. పూర్తి వివరాలకు ఉస్మానియా వెబ్‌సైట్ చూడవచ్చు.